నరక ప్రయాణం

- గుంతలు తేలి ప్రమాదకరంగా రోడ్లు
- ఇబ్బంది పడుతున్న పాదచారులు, వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

ఎర్రగడ్డ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ డివిజన్‌లోని రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. గుంతలు తేలి ప్రమాదకరంగా ఉండడంతో పాదచారులు, వాహనదారులు ప్రయాణించేందుకు జంకుతున్నారు. కొందరు సమీప సుదూర ప్రాంతం నుంచి వెళ్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎర్రగడ్డ డివిజన్‌లోని బస్తీల్లో డ్రైనేజీలు పొంగి మురుగునీరు రోడ్లపై ప్రవహించడం వల్ల దెబ్బతిన్నాయి. రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయి. కల్పతరు అపార్ట్‌మెంట్, సీటాడెల్ బ్రిగేడ్, వాసవి బృందావనం, జనప్రియ అపార్ట్‌మెంట్ తదితర అపార్ట్‌మెంట్ల వద్ద పెద్ద, పెద్ద గుంతలు పడ్డాయి. కల్పతరు అపార్ట్‌మెంట్ సమీపంలో రోడ్డుపై ఉన్న పెద్ద గుంత వద్ద ప్రమాదాన్ని నివారించేందుకు అపార్ట్‌మెంట్‌వాసులు చెక్కను అడ్డుగా పెట్టారు. సీటాడెల్ బ్రిగేడ్ అపార్ట్‌మెంట్ వద్ద రోడ్డు మధ్యలో ఇనుప పైపు తేలింది. గమనించని వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్ల మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.


శాస్త్రినగర్‌లో అధ్వానంగా ఉన్న రోడ్డు


ఆయుర్వేద ఆస్పత్రి వద్ద పొంగిపొర్లుతున్న డ్రైనేజీ


శాస్త్రినగర్‌లోని రోడ్డు


కల్పతరువు అపార్ట్‌మెంట్ వద్ద రోడ్డుపై ఏర్పడ్డ గుంతకు అడ్డంగా ఉంచిన చెక్క


సీటాడెల్ బ్రిగేడ్ అపార్ట్‌మెంట్ వద్ద రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా పైకి తేలిన ఇనుప పైపు


డాన్‌బాస్కో స్కూల్ రోడ్డు దుస్థితి


మోతీనగర్‌లో పెద్ద గుంత తేలి ఉన్న మ్యాన్‌హోల్


బీ శంకర్‌లాల్ నగర్‌లో అధ్వానంగా రోడ్డు

నిమ్స్ ఆస్పత్రిలో ఉచితంగా గుండె ఆపరేషన్లు

హైటెక్ సిటీ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పుట్టుకతోనే గుండె జబ్బుతో బాధపడుతున్న నలుగురు చిన్నారులకు నిమ్స్ ఆస్పత్రిలో సోమవారం ఆపరేషన్లు చేశారు. నిమ్స్, బ్రిటన్ వైద్యుల సంయుక్త ఆధ్వర్యంలో ఏడాది వయసున్న లక్ష్మీనరసింహ, రేయాన్స్‌తో పాటు ఐదేళ్ల వయసున్న రిషికేష్, స్వాన్వికకు శస్త్ర చికిత్స చేశారు. నలుగురి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.


జాఫర్ అలీబాగ్‌లో సమస్యలు తెలుసుకుంటున్న మహేష్‌యాదవ్

తాగునీరు ఉదయం సరఫరా చేయాలి

- మాజీ కార్పొరేటర్ మహేష్‌యాదవ్

బేగంపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ డివిజన్‌లోని జాఫర్ అలీబాగ్ ప్రాంతంలో ఉదయమే తాగునీరు సరఫరా చేయాలని బీఆర్ఎస్ నేత, మాజీ కార్పొరేటర్ ఎలిగల మహేష్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన జాఫర్ అలీబాగ్‌లో పర్యటించారు. ఉదయం వచ్చే తాగునీటిని కొన్నిరోజుల నుంచి మధ్యాహ్నం 2 గంటల సమయంలో వదులుతున్నారని, దీనివల్ల పనులకు వెళ్లే అవకాశం లేకుండా పోతుందని పలువురు మహిళలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అధికారులతో మాట్లాడి ఉదయం తాగునీరు వచ్చేలా చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు.


పోషణ్ అభియాన్ శిక్షణలో మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధి జాన్, సీడీపీఓ పుష్ప

పిల్లల ఎదుగుదలలో తండ్రి పాత్ర కీలకం

యూసుఫ్‌గూడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆరు సంవత్సరాల పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలలో తండ్రి పాత్ర కీలకమని ఐసీడీఎస్ ప్రాజెక్ట్-2 సీడీపీఓ పుష్ప అన్నారు. సోమవారం ప్రాజెక్ట్-2 కార్యాలయంలో పోషణ్ అభియాన్ శిక్షణ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. కార్యక్రమంలో సేసేమే వర్క్‌షాప్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు జాన్, నవీన్, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు సుశీల, స్వప్న, దేవి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే ధ్యేయం

యూసుఫ్‌గూడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సినీ స్టూడియోస్ వర్కర్స్ యూనియన్ కార్మికుల సంక్షేమమే ధ్యేయమని నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు జి.ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వీరేశం, కోశాధికారి ఆర్ పెద్ద ఉపేందర్ అన్నారు. సోమవారం వెంకటగిరి కార్యాలయంలో వారు మాట్లాడుతూ కార్మిక సంక్షేమ శాఖ బోర్డు నుంచి కార్మికులకు అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ సినీకార్మికులకు అందేలా చూస్తామన్నారు. యూనియన్ కార్డు ఉన్న ప్రతీ కార్మికుడికి పని దొరికేలా కృషి చేస్తామన్నారు. సమావేశంలో యూనియన్ సభ్యులు వైకుంఠరావు, విజయ్ కుమార్, జగన్, సుదర్శన్, నటరాజ్, రాజు పాల్గొన్నారు.

దివ్యాంగులు, చేయూత పింఛన్లు పెంచాలి

ఖైరతాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, చేయూత పింఛన్లు పెంచాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఖైరతాబాద్ తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం వారు నిరసన తెలిపారు. ఖైరతాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కె.శివ కుమార్ మాదిగ మాట్లాడుతూ దివ్యాంగులకు పింఛన్ రూ.4 వేల నుంచి రూ.6 వేలకు, చేయూత పెన్షన్‌దారులకు రూ.2 వేల నుంచి రూ. 4 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బొలిగడ్డ కుమార్, వెంకటేష్, సూరజ్ కృష్ణ, లక్ష్మణ్, సాయి మాదిగ, ప్రదీప్ పాల్గొన్నారు.

ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌పై దాడి

- ఆరుగురి అరెస్ట్

బంజారాహిల్స్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌పై దాడి చేయడమే కాకుండా విధ్వంసం సృష్టించిన ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.14 నందినగర్‌కు చెందిన గునోతు శ్రీనివాస్ నాయక్ ఆటోడ్రైవర్. ఈనెల 13న రోడ్డు నెంబర్.12 లోటస్‌పాండ్ నుంచి అపోలో ఆస్పత్రి వైపు వెళ్తున్నాడు. ఆటో అదుపు తప్పి వ్యాపారి శ్రీధర్ కారును ఢీ కొట్టింది. ఈ విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో శ్రీధర్ ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు గునోతు శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా తమ కుమారుడిని ఎలా అరెస్టు చేస్తారంటూ తండ్రి భద్రీనాయక్ నందినగర్‌కు చెందిన నవీన్, గణేశ్, నాగేంద్ర, మౌలిరెడ్డి మరికొంతమంది మహిళలు ఠాణాకు చేరుకున్నారు. పోలీసులను నిలదీశారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న వారు స్టేషన్‌లో ఉన్న ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. సిబ్బందిని దుర్భాషలాడారు. భద్రీనాయక్, నవీన్, గణేశ్, నాగేంద్ర, మౌలిరెడ్డి, శ్రీనివాస్‌పై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

వడ్డెరులకు రాజకీయ అవకాశాలు కల్పించాలి

బంజారాహిల్స్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వడ్డెరులకు రాజకీయ అవకాశాలు కల్పించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి అయిలమల్లు అన్నారు. సోమవారం వడ్డెర సంఘం నేతలు తెలంగాణ వడ్డెర సంఘం చారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర కార్యదర్శి సంపంగి రామకృష్ణ నేతృత్వంలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కను కలిశారు. యాదాద్రి జిల్లా యాదగిరిగుట్టలో అక్టోబరు 10వ తేదీన నిర్వహించనున్న వడ్డెర ఓబన్న విగ్రహావిష్కరణ, బహిరంగ సభకు హాజరుకావాలని కోరారు. అనంతరం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఆహ్వానం అందజేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు పీట్ల మల్లేష్, ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఓర్సు వీరభద్రం, భువనగిరి జిల్లా అధ్యక్షుడు పల్లపు బాలయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లపు దుర్గయ్య, పరశురాం, మక్కల వెంకన్న, దండ్ల వెంకటయ్య, బోదాసు మహేష్, అలంకుట రాజు పాల్గొన్నారు.


మంత్రి భట్టివిక్రమార్కను కలిసిన వడ్డెర సంఘం నేతలు

ఎస్సీ వర్గీకరణ వల్ల 58 కులాలకు తీవ్ర నష్టం


శ్రీధర్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న భాస్కర్, రామచందర్ తదితరులు

బంజారాహిల్స్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ వల్ల 58 కులాలు తీవ్రంగా నష్టపోతాయని మాల సంఘాల జేఏసీ ఆరోపించింది. అసెంబ్లీలో చర్చించి వీరికి న్యాయం చేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం ఎస్సీ వర్గీకరణ మంత్రివర్గ ఉప సంఘం సభ్యుడు, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం ఇచ్చారు. జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చెరుకు రామచందర్, జేఏసీ కన్వీనర్ నల్లాల కనకరాజు మాట్లాడుతూ విద్యార్థులకు, ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. కార్యక్రమంలో జేఏసీ గ్రేటర్ చైర్మన్ బేర బాలకిషన్, వర్కింగ్ చైర్మన్ మంత్రి నర్సింహ్మయ్య, మాల విద్యార్థి జేఏసీ చైర్మన్ మాదాసు రాహుల్ రావు, నాయకులు నాలుకల నర్సింగ్‌రావు, సామ తిరుపతయ్య, పండుగ భానుతేజ పాల్గొన్నారు.

దళితుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

బంజారాహిల్స్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దళితుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్న కాంగ్రెస్‌కు అందరూ అండగా నిలవాలని మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ కోరారు. సోమవారం ఎల్లారెడ్డిగూడలోని పీజేఆర్ కమ్యూనిటీహాల్లో కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎస్సీ సెల్ ముఖ్యనేతలు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప ఎన్నికలో హస్తం జెండా రెపరెపలాడాలన్నారు. ఎస్సీ సెల్ నియోజకవర్గ చైర్మన్‌గా నియామకమైన బోడ రామచందర్‌ను ఆయన మాజీ ఎంపీ అజారుద్దీన్‌తో కలిసి సత్కరించారు. సమావేశంలో కార్పొరేటర్ వనం సంగీత, మాజీ కార్పొరేటర్ సంజయ్‌గౌడ్, వనం శ్రీనివాస్‌యాదవ్, కిరణ్‌యాదవ్, మనోజ్ యాదవ్, చిన్నా ముదిరాజ్, ప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు.


ఎస్సీ సెల్ కార్యకర్తల సమావేశంలో అంజన్‌కుమార్‌యాదవ్


ఖైరతాబాద్ వద్ద బల్కాపూర్ నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలు

బల్కాపూర్ నాలాలో పేరుకుపోతున్న వ్యర్థాలు

పంజాగుట్ట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ నుంచి ఆనంద్ నగర్, తుమ్మలబస్తీ మధ్యలో నుంచి బల్కాపూర్ నాలా ప్రవహిస్తోంది. భారీ వర్షాలు పడ్డప్పుడు పై నుంచి వచ్చిన వర్షపు నీరు నాలాపై నుంచి ప్రవహించి ఖైరతాబాద్ ప్రధాన రహదారితో పాటు తుమ్మలబస్తీ, ప్రేమ్‌నగర్, ఆనంద్‌నగర్‌లలో మోకాలి లోతు నీరు నిలుస్తోంది. ఇటీవల కురిసిన భారీ వర్షానికి ఖైరతాబాద్ ప్రధాన రహదారి నుంచి తుమ్మలబస్తీకి వెళ్లే మార్గంలో బ్రిడ్జి కింద రకరకాల వ్యర్థాలు గుట్టలా పేరుకుపోయాయి. సంబంధిత అధికారులు స్పందించి ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేశారు.

రోడ్డుపై చెత్త వేసిన వారికి జరిమానా

బోరబండ, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై చెత్త పారపోసిన వారికి శిక్ష తప్పడం లేదు. రహదారులపై ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా జీహెచ్ఎంసీ చేపట్టిన చర్యలు అంతగా ఫలించక పోవడంతో పోలీసులు రంగంలోకి దిగారు. వెస్ట్‌జోన్ డీసీపీ ఎం.ఎస్.విజయ్‌కుమార్ ఆదేశాల మేరకు బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డుపై చెత్తవేసిన వారిపై కేసులు పెడుతున్నారు. ఇటీవల ఐదుగురిపై కేసులు పెట్టి న్యాయస్థానంలో హాజరుపరచగా రూ.500 చొప్పున జరిమానా విధించినట్లు బోరబండ పోలీసులు తెలిపారు. తాజాగా, సోమవారం మరో ఇద్దరిపై బోరబండ ఠాణాలో కేసులు నమోదయ్యాయి. శ్రీరామ్‌నగర్ ముబారక్ కేఫె వద్ద, ఎస్పీఆర్ హిల్స్ ప్రాంతంలో రోడ్డుపై చెత్తవేసిన సుమోద్, విక్రంసింగ్‌పై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

వెంగళరావునగర్ టి-జంక్షన్ వద్ద విద్యుత్ స్తంభాలకు ఉన్న వివిధ కేబుల్ తీగలను తెంపి అక్కడే వదిలేసిన విద్యుత్ సిబ్బంది


● వెంగళరావునగర్, ఆంధ్రజ్యోతి

ప్రైవేట్ విద్యాసంస్థల నిరవధిక బంద్‌కు మద్దతు

పంజాగుట్ట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పేద, బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలనే సదుద్దేశ్యంతో గత ప్రభుత్వాలు తీసుకొచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ పథకాలను ఎత్తివేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతున్నదని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు ఆరోపించారు. ప్రైవేట్ విద్యాసంస్థల నిరవధిక బంద్‌కు తాము మద్దతిస్తున్నామని ఆయన ప్రకటించారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఎన్ఈసీ సభ్యుడు జీవన్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు పృథ్వీ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు రాజ్, కళ్యాణితో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు దాటినప్పటికీ రూ.8,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థులను అరిగోస పెడుతుందని ఆరోపించారు.

పోలీస్ శాఖలో 20 వేల ఉద్యోగాలు భర్తీ చేయాలి

పంజాగుట్ట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పోలీస్ శాఖలో 20 వేల కానిస్టేబుల్, తదితర ఉద్యోగాల భర్తీకి వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలని, గ్రామీణ ప్రాంత అభ్యర్థులకు నష్టం కలిగించే జీవో.46ను రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర పోలీస్ నిరుద్యోగ జేఏసీ డిమాండ్ చేసింది. లేకపోతే స్థానికసంస్థల ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వానికి తమ సత్తా ఏమిటో చూపుతామని జేఏసీ నాయకులు హెచ్చరించారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జేఏసీ నాయకులు నవీన్ పట్నాయక్, ఆకాష్‌గౌడ్, శంకర్, వంశీ తదితరులు మాట్లాడారరు. తాము అధికారంలోకి వస్తే జీవో 46 రద్దు చేస్తామని, పోలీస్ శాఖలో ఉద్యోగాలు భర్తీ చేస్తామని అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా నేటికి జీవో 46పై ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదని ఆరోపించారు. సమావేశంలో జేఏసీ సభ్యులు మహేష్, లోకేష్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

బోరబండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మోతినగర్‌లో సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జూబ్లీహిల్స్ జోన్ కార్యదర్శి సునీల్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులను పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మనోజ్, జగదీష్, ప్రిన్స్ లాల, చందు, రాకేష్ పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న సోపన సారంగి

ప్రసాద పథకం పనులు పూర్తి చేయాలి

అమీర్‌పేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర టూరిజం మంత్రిత్వ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ సోపన సారంగి సోమవారం బల్కంపేట ఎల్లమ్మ ఆలయాన్ని సందర్శించారు. ప్రసాద పథకం కింద చేపట్టాల్సిన పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆరునెలల్లోపు పనులు పూర్తి చేయాలని టూరిజం శాఖ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.


మొక్క నాటుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల

మోదీ నాయకత్వంలో దేశానికి ఆదరణ

- మాజీ ఎమ్మెల్యే చింతల

బంజారాహిల్స్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మోదీ నాయకత్వంలో దేశానికి ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరిగిందని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మోదీ జన్మదినం సందర్భంగా దేశవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో సోమవారం అగర్వాల్ సమాజ్ ఆధ్వర్యంలో ఫిలింనగర్ రౌండ్‌టేబుల్ ప్రభుత్వ పాఠశాలలో బీజేపీ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు లంకాల దీపక్‌రెడ్డితో కలిసి ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న సురేందర్ తదితరులు

'చిత్తారమ్మ ఆలయ భూమిని ఇస్కాన్ స్వాధీనం చేసుకోవద్దు'

రాయదుర్గం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి గోపన్‌పల్లి గ్రామంలోని చిత్తారమ్మ ఆలయం చుట్టూ ఉన్న భూమిని ఇస్కాన్ సంస్థ అధీనంలోకి తీసుకుని చదును చేశారు. స్థానికులతో కలిసి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పల్లపు సురేందర్ ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తారమ్మ ఆలయం చుట్టూ ఉన్న భూమిని ఇస్కాన్ స్వాధీనం చేసుకుంటే బోనాల ఉత్సవాలు, జాతర నిర్వహించేందుకు స్థలం లేకుండా పోతుందన్నారు. కార్యక్రమంలో శ్రీరంగనాథస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు రవీంద్రప్రసాద్ దూబే, ఉపాధ్యక్షుడు నర్సింహ, కార్యదర్శులు అనిల్, జితేందర్, నర్సింగ్‌రావు, సభ్యులు సత్యనారాయణ, శంకరి రాజు, రంగస్వామి పాల్గొన్నారు.

బతుకమ్మ కుంటలకు మరమ్మతులు

హైదర్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ పండుగను పురస్కరించుకుని బతుకమ్మ కుంటలకు చేస్తున్న మరమ్మతు పనులను జీహెచ్ఎంసీ ఏఈ నిఖిల్‌తో కలిసి కార్పొరేటర్ మాధవరం రోజాదేవి సోమవారం పరిశీలించారు. పండుగను ప్రజలు ఆనందంగా జరుపుకునేలా ఏర్పాట్లు చేయాలని ఆమె అధికారులను కోరారు.



వర్షంనీరు నిలిచిన ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత

వర్షం నీరు నిలువకుండా చర్యలు

చిలకలగూడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆదివారం కురిసిన భారీ వర్షానికి మెట్టుగూడలోని ఆలుగడ్డ బావి ఏపీ రైస్ స్టోర్, హనుమాన్ ఆలయం ప్రాంతంలోని ఇళ్లు, రోడ్లపై నీరు చేరింది. మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత సోమవారం అధికారులతో కలసి ఈ ప్రాంతంలో పర్యటించి నిలువ నీటిని తొలగించటానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం మాట్లాడుతూ లోతట్టు ప్రాంతం కావడంతో భారీగా వర్షం నీరు వస్తుందని, అవసరమైన పైపులైన్ల ఏర్పాటు పనులు జరుగుతున్నాయని సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు.



గాంధీ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ ప్రతినిధులు

పీవైఎస్ డిమాండ్లపై స్పందించిన గాంధీ సూపరింటెండెంట్


అడ్డగుట్ట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గాంధీలో చేపట్టిన ధర్నాను రద్దు చేసుకున్నామని, తమ డిమాండ్లపై గాంధీ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి సానుకూలంగా స్పందించారని ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పీవైఎస్) గ్రేటర్ నాయకులు బిఎస్ కృష్ణ, కొల్లూరు భీమేష్‌లు తెలిపారు. గాంధీ ఆస్పత్రిలో పీవైఎల్ ఆధ్వర్యంలో గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగుల ఇబ్బందులపై ధర్నా చేయాల్సి ఉండగా సూపరింటెండెంట్ డాక్టర్ వాణి నేరుగా తమతో సోమవారం గాంధీ ఆస్పత్రి కాన్ఫరెన్స్ హాలులో చర్చలు జరిపారని అందుకు సంతోషిస్తున్నామన్నారు. సుమారు 18 డిమాండ్లతో సూపరింటెండెంట్ ముందు ప్రతిపాదన చేశామని, ఈ డిమాండ్లను నెలరోజుల్లో పరిష్కారం చేయాలని ప్రతిపాదన ఉంచామన్నారు. అదే విధంగా గాంధీలో ఔట్‌సోర్సింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ గార్డులకు నాలుగు నెలల నుంచి జీతాలు ఇవ్వడంలేదని వెంటనే జీతాలు ఇవ్వాలని ముఖ్య ప్రతిపాదించారు. ఈ చర్చల్లో టీయూసీఐ గ్రేటర్ కార్యదర్శి ప్రదీప్, పీవైఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవికుమార్, ఉపాధ్యక్షుడు కిరణ్, మల్లేష్, బాలు, ప్రకాశ్, శంకర్, సురేష్; రాజు, టియూసిఐ నగర నాయకులు వెంకటేష్‌లు పాల్గొన్నారు.



అడ్డగుట్టలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న బహుజన దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులికల్పన

వరద బాధితులకు ప్రభుత్వం అండగా నిలవాలి

అడ్డగుట్ట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వరుసగా కురుస్తున్న భారీ వర్షాలతో సర్వం కోల్పోయిన వరద బాధితులకు ప్రభుత్వం సాయం అందజేసి అండగా నిలవాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన డిమాండు చేశారు. సోమవారం అడ్డగుట్టలోని లోహినగర్ బస్తీలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అడ్డగుట్ట డివిజన్‌లోని లోహినగర్, గాంధీనగర్, మొండిబండనగర్ రాంనగర్ తదితర ప్రాంతాల్లో దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో సేకరించిన నిత్యావసరాలను బస్తీవాసులకు అందజేశామన్నారు. అకాల వర్షాలతో రాష్ట్ర వ్యాపితంగా వివిధ ప్రాంతాల్లో ప్రజలు నిరాశ్రయులుగా మారారన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు నళిని, శారద, ఈశ్వర్, బన్నమ్మలు పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్ రాజు నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

పెన్షన్ పెంచకపోతే మంత్రులను అడ్డుకుంటాం

● కొల్లి నాగేశ్వర్‌రావు

అడ్డగుట్ట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సీఎం హామీ ప్రకారం దివ్యాంగులకు నాలుగు వేలు పించన్ పెంచకపోతే ఎమ్మెల్యేలను తిరుగనివ్వమని వికలాంగుల హక్కుల పోరాటం సమితి జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ కొల్లి నాగేశ్వర్‌రావు హెచ్చరించారు. పించన్లు పెంచాలని కోరుతూ సోమవారం అడ్డగుట్టలోని మారేడుపల్లి తహసీల్దార్ కార్యాలయం ముందు ఎమ్మార్పీఎస్, వికలాంగుల హక్కుల పోరాట సమితి, సీహెచ్‌పీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున దివ్యాంగుల సంస్థల కార్యకర్తలు ధర్నా, ముట్టడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాగులు, వృద్ధులు, వితంతవులు, ఒంటరి మహిళలు, చేనేత, బీడి, గీత కార్మికులకు, కండరాల క్షీణత ఉన్న వారికి రూ.15వేలు పెన్షన్ పెంచాలన్నారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కోర్ కమిటీ చైర్మన్ గోపాల్, అందే దయామని, సికింద్రాబాద్ ఇన్‌చార్జి డప్పు మల్లికార్జున్, జోగు దశరథ్, శ్రీనివాస్, భువనేశ్వర్, కళాజ్యోతి, భూపతి సుజాత, సురారం సుజాత, బాబురావు, మహేష్, బీజేవైఎం అడ్డగుట్ట అధ్యక్షుడు గెల్లు ఉదయ్ యాదవ్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు ప్రసాద్, భిక్షపతిలు పాల్గొన్నారు.

డ్రాపౌట్ల బడిబాట



డ్రాపౌట్ల పిల్లల్ని బడికి పంపడానికి కౌన్సిలింగ్ ఇస్తున్న తెలంగాణ తల్లుల సంఘం రాష్ట్ర కార్యదర్శి భాగ్యలక్ష్మి

స్వచ్ఛంద సంస్థల సంకల్పం

అడ్డగుట్ట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అడ్డగుట్టలో బతుకు పోరాటంతో పోరాడుతున్న నిరుపేదలు తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపడానికి కూడా వారి ఆర్థిక ఇబ్బందులు అడ్డువస్తున్నాయి. తల్లిదండ్రులు పనులకు వెళ్లి పిల్లల్ని ఇంటి వద్దే ఉంచడంతో వారు చదువులకు దూరం అవుతున్నారు. బడులకు దూరంగా ఉన్న డ్రాపౌట్ పిల్లల్ని మరలా బడులకు పంపించేందుకు బాలల హక్కుల పరిరక్షణ వేదిక ప్రతినిధులు లక్ష్మీనారాయణ, సువర్ణ, తెలంగాణ తల్లుల సంఘం రాష్ట్ర కార్యదర్శి భాగ్యలక్ష్మి, రుద్రవీణ మహిళా సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు నక్కల శోభలతో పాటు ఈ సంస్థ ప్రతినిధులు అడ్డగుట్టలో శ్రమించి స్థాయికి మించి పనిచేస్తున్నారు. బడికి దూరమైన పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ బడి పనితీరుపై విశ్లేషించి చెబుతున్నారు.

- మారేడుపల్లి మండల పరిధిలో ఇప్పటికీ 234 మంది ఇంటి వద్దే ఉంటున్నారు. ఈ మధ్య కాలంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఈ విద్యా సంఘాలు ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులకు నచ్చజెప్పగా 31 మంది డ్రాపౌట్ల పిల్లల్ని అడ్డగుట్ట ప్రభుత్వ బడిలో చేర్పించారు. చాలామందికి బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు లేకపోవడంతో బడికి దూరంగా ఉన్నారు. బడిబాట కార్యక్రమంలో ఈ సర్టిఫికెట్లు లేకపోయినా ప్రభుత్వ బడిలో చేర్పించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇలా కొంతమందికి ప్రభుత్వ బడిలో అడ్మిషన్ ఇవ్వడం వల్ల చదువుకుంటున్నారు.
- బాల కార్మికులను మరలా బడికి పంపించేందుకు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సికింద్రాబాద్ నియోజకవర్గం అడ్డగుట్ట డివిజన్‌లో పర్యటిస్తున్నారు. ఈ ప్రాంతంలో రోడ్లపై ఆడుకుంటున్న చిన్నపిల్లల వద్దకు వెళ్లి వారి తల్లిదండ్రుల వివరాలను సేకరిస్తున్నారు. ఇలా సేకరించిన తర్వాత వారి తల్లిదండ్రులను కలిసి మీరు కూలి పనికి పోతే పిల్లల భవిష్యత్తును నాశనం చేస్తారా, ఉచితంగా ప్రభుత్వ బడులు ఉన్నాయి చేర్పించమని వారికి చెబుతున్నారు. అలాగే కార్పొరేట్ స్కూళ్లకంటే ప్రభుత్వ బడుల్లో చదువు చెబుతున్న టీచర్లు పెద్ద చదువులు చదువుకుని టీచర్లుగా పనిచేస్తున్నారు అంటూ తల్లిదండ్రులకు ధైర్యం చెబుతున్నారు.

దుకాణాలపై నిఘా

తుకారాంగేట్ అడ్డగుట్ట ఏరియాలో దుకాణాల్లో పనిచేస్తున్న పిల్లలపై ఈ స్వచ్ఛంద సంస్థలు నిఘా ఉంచారు. దుకాణాల్లో పనిచేస్తున్న పిల్లల విషయాలను చైల్డ్‌లైన్‌కు సమాచారం ఇచ్చి పిల్లల్ని బడికి పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే దుకాణాల్లో పనికి పెట్టుకున్న యజమానులపై కఠిన చర్యలు తీసుకునే విధంగా ఇక్కడ పనిచేస్తున్నారు. అంతేకాకుండా గంజాయి మత్తుకు అలవాటుపడిన పిల్లల్ని మార్చడానికి ఈ స్వచ్ఛంద సంస్థలు విశ్వ ప్రయత్నం చేస్తున్నాయి.



నచ్చ జెపుతున్నాం

తల్లిదండ్రులు కూలి పనికి పోవడానికి పిల్లల్ని బడికి పంపకుండా ఇంటి వద్దే అట్టిపెడుతున్నారు. అలాంటి వారిని గుర్తించి నేరుగా ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి డ్రాప్ ఔట్ పిల్లల్ని మళ్లీ బడికి తీసుకొస్తున్నాం. అలాగే ప్రభుత్వ బడిలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని నచ్చజెపుతున్నాం. ఇప్పటివరకు 31 మంది డ్రాప్ ఔట్ పిల్లల్ని ప్రభుత్వ బడిలో అడ్మిషన్ ఇప్పించాం.

- సువర్ణ, బాలల హక్కుల పరిరక్షణ వేదిక కో-ఆర్డినేటర్



హాస్టల్‌లో చేర్పిస్తున్నాం

అడ్డగుట్ట శాస్త్రినగర్‌బస్తీలో ఐదేళ్ల బాలుడు తల్లిదండ్రులు లేరు. అమ్మమ్మ పోషిస్తుంది. ఆమె పనికి వెళితే బాబు రోడ్డుపైనే తిరుగుతుంటాడు. ఏడాది నుంచి బాలుడిని గమనించాం. నెలరోజుల క్రితం బాలుడి అమ్మమ్మతో మాట్లాడి ఒక ప్రభుత్వ హాస్టల్‌లో చేర్పించి బడికి పంపించే విధంగా తుకారాంగేట్ పోలీసుల సాయంతో బాబును హాస్టల్ చేర్పించాం. 14ఏళ్ల బాబుకు అందరూ ఉన్నారు. కానీ వ్యసనాలతో దొంగతనాల బాటలో పడ్డాడు. బాబును కూడా హాస్టల్ చేర్పించి అక్కడనే ప్రభుత్వ బడిలో చదివించే విధంగా పనిచేశాం.

- నక్కల శోభ, రుద్రవీణ మహిళా సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు



పేరెంట్స్ కమిటీలో తల్లిదండ్రులే ఉండాలి

ప్రభుత్వ బడుల్లో చదువుకుంటున్న విద్యార్థుల తల్లిదండ్రులే పేరెంట్ కమిటీలో ఉండేవిధంగా చూస్తున్నాం. అలా చేస్తే పాఠశాలలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయన్నది వారికి తెలుస్తుంది. తద్వారా సమస్యలను కమిటీ సమావేశంలో చర్చిస్తారు. ఈ ప్రతిపాదనను విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళతాం.

- భాగ్య, తెలంగాణ తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్



చిన్నారిని బడికి తీసుకొచ్చేందుకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎంవీ ఫౌండేషన్, తల్లుల సంఘం ప్రతినిధులు



బాలికకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధి సువర్ణ



పోలీసుల సాయంతో ఇద్దరిని చైల్డ్‌లైన్‌కు తరలించిన రుద్రవీణ మహిళా సంఘం అధ్యక్షురాలు నక్కల శోభ

కళా సిల్క్స్ చేనేత వస్త్ర కళా ప్రదర్శన ప్రారంభం

60% తగ్గింపు ధరలతో అమ్మకాలు



ఓ స్టాల్‌లోని చీరలను ఆసక్తిగా చూస్తున్న మహిళ

సికింద్రాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు చేనేత వస్త్రాలను ధరించి చేనేత కార్మికులకు చేయూతనందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కళా సిల్క్స్ నిర్వాహకులు వినోద్ నేగి అన్నారు. పద్మారావునగర్‌లోని కొత్త కామకోటి కల్యాణ నిలయ హాల్‌లో ఏర్పాటు చేసిన కళా సిల్క్స్ హస్తకళా చేనేత ప్రదర్శనకు స్థానికుల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, కాంతావర్క్స్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్ శారీస్, లినెన్ శారీస్, కళంకారి, బెంగాల్ కాటన్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ జాకెట్‌లు, లక్నో చికాన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జువెలరీ వంటివి మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దేశవ్యాప్తంగా 14 నగరాలకు చెందిన చేనేతకారులు తమ ఉత్పత్తులను 70కి పైగా స్టాల్స్‌లో పెట్టి వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. ప్రదర్శన ప్రవేశం ఉచితమని, మరో వారం రోజుల్లో ప్రదర్శన ముగుస్తుందని నిర్వాహకులు వినోద్ నేగి తెలిపారు.

లోతట్టు ప్రాంతాల సమస్యను పరిష్కరిస్తా : కార్పొరేటర్



అంబర్‌నగర్‌లో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ



నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

బౌద్ధనగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆదివారం రాత్రి కురిసిన భారీవర్షం పురస్కరించుకుని సోమవారం బౌద్ధనగర్ డివిజన్లో లోతట్టు ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ కంది శైలజ అధికారులతో కలిసి పర్యటించారు. కౌసర్‌మసీద్, అంబర్‌నగర్, ఎల్.నారాయణనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను నుంచి సమస్యలను స్వీకరించారు. అంబర్‌నగర్‌లో భారీవర్షానికి కూలిపోయిన రేకుల ఇంటిని వారు పరిశీలించారు. తనవద్దకు తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరిస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఈ తిరుపతి, ఏఈ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

బౌద్ధనగర్ అంబర్‌నగర్‌లో ఇంటిపైకప్పు కూలిపోయిన కుటుంబానికి బీజేపీ యువ నాయకురాలు మేకల కీర్తిహర్షకిరణ్ నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు హన్మంతు, కొమరయ్య, అర్వింద్, సత్యనారాయణ, శ్యామ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంబేడ్కర్‌నగర్ వాసులకు తీరనున్న నీటి ఎద్దడి

● డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద పవర్ బోర్



పవర్ బోర్ పనులను ప్రారంభిస్తున్న స్థానికులు

రాంగోపాల్‌పేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్‌నగర్ వాసులకు ఎట్టకేలకు నీటి కష్టాలు తీరనుంది. గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నెక్లెస్ రోడ్డు పీవీ మార్గ్‌లోని అంబేడ్కర్‌నగర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాన్ని నిర్మించింది. వారికి జలమండలి పంపిణీ చేసే నీరు సరిపోవడం లేదు. దీనితో స్థానికులు పవర్ బోర్ కావాలని మాజీ కార్పొరేటర్ అతెల్లి అరుణ గౌడ్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అతెల్లి శ్రీనివాస్ గౌడ్ ద్వారా సనత్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన ఎమ్మెల్యే నిధుల నుంచి బడ్జెట్ కేటాయించి పవర్ బోర్‌ను మంజూరు చేశారు. కాగా సోమవారం గృహ సముదాయం వద్ద పవర్ బోర్ పనులను స్థానికులు కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. తమకు నీటి ఎద్దడి తీరనుండడంతో వారు పవర్ బోర్ ఏర్పాటుకు సహకరించిన మాజీ కార్పొరేటర్ అతెల్లి అరుణ గౌడ్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అతెల్లి శ్రీనివాస్ గౌడ్, సనత్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అంబేడ్కర్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ.దేవరాజ్, బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి మాతాంగి గణేష్, సాగర్ దత్త, రవి సింగ్, రాంసింగ్, అరుణ్ సింగ్‌లతో పాటు పలువురు డబుల్ బెడ్ రూమ్ గృహ సముదాయ నివాసులు పాల్గొన్నారు.



శ్రీనివాస్‌నగర్‌లో స్థానికుల సమస్యలను తెలుసుకుంటున్న ఉప కమిషనర్ ఆంజనేయులు, కార్పొరేటర్ సామల హేమ తదితరులు

నాలా పరీవాహక ప్రాంతాల్లో డీసీ పర్యటన

బౌద్ధనగర్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్‌లో నాలా పరీవాహక ప్రాంతాల్లో సోమవారం జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ ఉప కమిషనర్ ఆంజనేయులు, స్థానిక కార్పొరేటర్ సామల హేమ అధికారులతో కలిసి పర్యటించారు. ఆదివారం కురిసిన భారీవర్షానికి శ్రీనివాస్‌నగర్, బ్రాహ్మణ బస్తీ, ఫ్రైడే మార్కెట్ తదితర లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షపునీరు వచ్చిచేరాయి. ఆ ప్రాంతంలో వారు పర్యటించి స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాలా ప్రాంతంలో నివసించేవారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శ్రీనివాస్‌నగర్‌లో నాలాలో పెద్ద భారీవృక్షం కూలిపోవటంతో నాలా ప్రహరీ కూలిపోయింది. కార్పొరేటర్ హైడ్రా, జీహెచ్ఎంసీ సిబ్బందిని అప్రమత్తం చేసి చెట్టును తొలగించారు. ఈ కార్యక్రమంలో డీఈ వెంకటేశ్, ఏఈ కౌశిక్, హర్టికల్చరల్ సూపర్‌వైజర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు. సీతాఫల్‌మండి డివిజన్‌లో పలు నాలా పరివాహక ప్రాంతాల్లో ఆదివారం రాత్రి బీఆర్ఎస్ యువ నాయకుడు తీగుళ్ల రామేశ్వర్‌గౌడ్ పర్యటించారు.

ఫ్లెక్సీల విషయంలో ఇరువర్గాల మధ్య గొడవ

● ముగ్గురికి తీవ్రగాయాలు ● ఒకరి పరిస్థితి విషమం

బోయినపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మిలాద్ ఉన్ నబీ వేడుకలు పురస్కరించుకొని శనివారం రాత్రి ఫ్లెక్సీల ఏర్పాటు విషయంలో ఓల్డ్ బోయినపల్లి హస్మత్ పేట చౌరస్తాలో వివాదం చోటు చేసుకుంది. అల్వాల్‌కు చెందిన కొంతమంది యువకులతో హస్మత్‌పేటకు చెందిన బబ్లు గ్యాంగ్ మధ్యన ఎంఐఎం పార్టీ కార్యాలయం ముందు గొడవ జరిగింది. అదేరోజు రాత్రి హస్మత్‌పేటకు చెందిన యువకులు అల్వాల్‌కు చెందిన యువకులను అక్కడికి వెళ్లి వాళ్లను చితకబాదారు. ఈ ఘర్షణలో అల్వాల్‌కు చెందిన నలుగురు యువకులకు తీవ్ర గాయాలైనట్టు సమాచారం. కాగా గాయపడిన యువకులను హస్మత్‌పేటలోని రమ్య ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. అల్వాల్‌కు చెందిన సుమారు వందమంది హస్మత్‌పేటకు చెందిన బబ్లు గ్యాంగ్‌పై సోమవారం సాయంత్రం దాడి చేసేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న బోయినపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇరు వర్గాలను చెదరగొట్టడానికి లాఠీచార్జి చేశారు. గొడవ సమాచారం డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్, బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి పోలీస్ బలగాలతో ఘటన స్థలానికి చేరుకొని లాఠిచార్జి చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఈ బందోబస్తులో బోయినపల్లి, అల్వాల్, తిరుమలగిరి, కార్ఖానా సీఐలు తిరుపతి రాజు, నాగరాజు, ఎస్సైలు శివశంకర్, గణేష్ గౌడ్ సిబ్బంది ఉన్నారు. ఈ ఘర్షణకు కారణమైన ఇరువర్గాల యువకులను గుర్తించేందుకు బోయినపల్లి పోలీసులు సీసీ కెమెరాలను నిశితంగా పరిశీలిస్తున్నారు.



శ్రీహర్ష

విద్యార్థి అదృశ్యం

బోయినపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఓ విద్యార్థి అదృశ్యమైన ఘటన బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంచారపురి కాలనీలో జరిగింది. ఎస్ఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం షేక్‌పేట్‌కు చెందిన విద్యార్థి చింతపూడి శ్రీహర్ష తల్లి ఆమప్రగడ దుర్గ శర్వాణి 1వ తేదీన ఏపీలోని ఏలూరుకు వెళుతూ కుమారుడిని తన అత్తమామల ఇంటికి పంపించింది. ఈ నెల 9న అతడు న్యూ బోయినపల్లి కెరీర్ అకాడమీ సమీపంలోని సంచారపురి కాలనీ ఫేజ్1లోని అత్తమామల ఇంటికి వెళ్లాడు. అక్కడి నుంచి ప్రతీరోజు మెహిదీపట్నంలోని రాయల్ జూనియర్ కళాశాలకు వెళుతుండేవాడు. 14న రాత్రి 8 గంటలకు శ్రీహర్ష ఇంటికి వెళ్లిపోతానని చెప్పగా, వారు క్యాబ్ బుక్ చేసి పంపుతామని చెప్పారు. అయితే రాత్రి 8.24 గంటలకు దుర్గ శర్వాణికి అత్త ఫోన్ చేసి మీ కుమారుడు ఇంటి నుంచి వెళ్లిపోతానని చెప్పి వెళ్లిపోయాడని తెలిపింది. వెంటనే దుర్గ శర్వాణి మామ సమీపంలోని ప్రదేశాల్లో ఉంటాడేమో అన్న సందేహంతో అతడి కోసం గాలించారు. కానీ అతడి ఆచూకీ లభించలేదు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పెన్షన్లు పెంచాలని ధర్నా

● ఇటిక శ్రీకిషన్ మాదిగ డిమాండ్



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీకిషన్ మాదిగ బృందం

తిరుమలగిరి సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళ, నేత, గీత బీడి కార్మికులకు పెన్షన్లను పెంచాలని డిమాండ్ చేస్తూ ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు కంటోన్మెంట్ ఎంఆర్‌పీఎస్ ఇన్‌చార్జి ఇటిక శ్రీకిషన్ ఆధ్వర్యంలో సోమవారం ఛలో తహసీల్దార్ కార్యక్రమంలో భాగంగా తిరుమలగిరి మం డల కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా చేశారు.

వికలాంగులకు రూ.6000 వేలు, వితంతువులు, వృద్ధులు, ఒంటరి మహిళ, నేత, గీత, బీడి కార్మికులతో పాటు పూర్తి కండరాల క్షీణత కలిగిన వారికి రూ. 15000వేలు పెన్షన్లు ప్రభుత్వం వెంటనే పెంచాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. కాంగ్రెస్ ఎన్నికల మానిఫెస్టోలో పెన్షన్లు పెంచుతామని ఇచ్చిన హామీ మేరకు నూతన పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వం నూతన పెన్షన్లు మంజూరు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. లేదంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలతో ఆందోళనలు, ధర్నాలు, కార్యాలయాల ముట్టడికి శ్రీకారం చుడతామని అన్నారు. అనంతరం ఎంఆర్ఓ భిక్షపతికి వినతిపత్రాన్ని అందజేశారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 21నెలలు గడిచిపోయినా ఇప్పటివరకు పెన్షన్లు పెంచలేదని విమర్శించారు. పెన్షన్ పెంచకుండ నిర్లక్ష్యం తీరుకు నిరసనలు ఆందోళనలు చేపడామన్నారు. ధర్నాలో వీహెచ్‌పీఎస్, సీహెచ్‌పీఎస్ నాయకులు శ్రీనివాస్ కంటోన్మెంట్ కో ఇన్‌చార్జి మంద మధుకర్ మాదిగ, కంటోన్మెంట్ మహిళా ఇన్‌చార్జి రేకా మాదిగ, ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకుడు విశ్వనాథ్, ఎంఆర్‌పీఎస్ కంటోన్మెంట్ వైస్ ప్రెసిడెంట్ బ్యాగరి నర్సింహ, చింటు, గుండమాల నర్సింహ, వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకురాలు స్నేహ, సాయి మాదిగ, మక్కల అశోక్, జున్ను రేణుక, సంజీవ్, సుధరాణి, సరిత, లక్ష్మీ పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ మార్గాల ఏర్పాటుకు చర్యలు

● బాలానగర్ మండల విద్యాధికారి హరిశ్చంద్ర



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న విద్యాశాఖ అధికారులు

బోయినపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మత్తు పదార్థాల తయారీ కేసులో ఓల్డ్ బోయినపల్లిలోని మేధా స్కూల్‌ను అధికారులు ఆదివారం సీజ్ చేశారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారడంతో వారికి ప్రత్యామ్నాయ మార్గాలను చూపనున్నట్లు బాలానగర్ మండల విద్యాధికారి హరిశ్చంద్ర తెలిపారు. విద్యా సంవత్సరం వృథా కాకుండా ఇతర పాఠశాలల్లో చేర్పించేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు, ఆ దిశగా చర్యలు ప్రారంభించామని తెలిపారు. పాఠశాల యాజమాన్యం అందుబాటులో లేకపోవడంతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో చర్చించి నిర్ణయం తీసుకొని సమీప పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ పాఠశాలకు ఏడవ తరగతి వరకే ప్రభుత్వ గుర్తింపు ఉందని 8, 9, 10లకు అనుమతులు లేవని ఆయన తెలిపారు. దీంతో ఆందోళనకు దిగిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు విద్యాశాఖ అధికారులు, బోయినపల్లి పోలీసులు భరోసా కల్పించారు. కాగా 8, 9, 10 తరగతుల విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని విద్యాశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోనున్నామని తెలియజేశారు.

మల్కాజిగిరిలో స్లాటర్ హౌజ్ ఏర్పాటు చేయాలి

మౌలాలి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు అందుబాటులో ఉండేలా మల్కాజిగిరిలో స్లాటర్ హౌజ్‌ను ఏర్పాటు చేయాలని కోరినట్లు మల్కాజిగిరి సర్కిల్ మటన్‌షాపు అసోసియేషన్ అధ్యక్షుడు గౌలికర్ అశోక్ తెలిపారు. సోమవారం వెస్ట్ మారేడుపల్లిలో జోనల్ వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ రామకృష్ణను మల్కాజిగిరి సర్కిల్ మటన్, చికెన్ షాపు అసోసియేషన్ ప్రతినిధులు గౌలికర్ అశోక్, విజయ్ తదితరులు కలిసి షాపు యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు శైలేందర్, గౌలికర్ దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.